సాక్షి
అనంతపురం
శనివారం । 15 । మార్చి । 2025




**టన్ను చీనీ రూ.23,750**

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,750 పలికాయి.



**టమాట కిలో రూ.8**

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా 5, సరాసరిన రూ.7 ప్రకారం ధర పలికింది.




# ఆదమరిస్తే అంతా మోసమే



● తూకాలు, కొలతలు, వస్తు నాణ్యతలో తస్మాత్ జాగ్రత్త ● మోసాలను అడ్డుకోకపోతే తప్పదు భారీ మూల్యం

**సందర్భం** నేడు వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినం

▸ బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన ఎరుకల అంజనప్ప గతేడాది సత్తార్ అనే వ్యాపారి వద్ద వేరుశనగ విత్తనం కొన్నాడు. నాసిరకం విత్తనం కావడంతో పంట పూర్తిగా నష్టపోయాడు. జరిగిన నష్టాన్ని వినియోగదారుల సంఘం ద్వారా పోరాడి ఎకరాకు రూ.15 వేల చొప్పున నష్టపరిహారం పొందాడు. రసీదు ఉండడంతో వినియోదారు సమాఖ్య ద్వారా న్యాయపోరాటం చేయగలిగాడు.

▸ రాయదుర్గంలో విశ్రాంత హెచ్ఎం సత్య నారాయణ తన ఇంటి వద్ద తోట ఏర్పాటు చేసుకుని, సవరేటు మీటర్ ద్వారా కరెంటు వినియోగిస్తున్నారు. అయితే ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే కమర్షియల్ కేటగిరీ కిందకు మార్చేసి రూ.400 వచ్చే బిల్లును ఏకంగా రూ.11 వేలకు ఇచ్చారు. బిల్లు చెల్లించలేదని కరెంటు సరఫరా నిలిపివేశారు. అధికారులకు అడిగినా లాభం లేకపోవడంతో వినియోగదారు సమాఖ్య ద్వారా మధ్యవర్తిత్వం చేయించారు. కరెంటు సరఫరా పునరుద్ధరణతో పాటు గతంలో ఎంత బిల్లు వచ్చేదో ఇప్పుడూ అంతే బిల్లు వస్తోంది.



**అనంతపురం /అనంతపురం కల్చరల్:** అనంతపురంలో కలెక్టరేట్ సమీపంలోని పెన్నార్ భవన్‌కు ఎదురుగా ఒక వినియోగదారుడు కిలో ఆపిల్ పండ్లు కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాడు. అనుమానం వచ్చి ఎలక్ట్రికల్ వేయింగ్ మెషిన్‌లో చూడగా 800 గ్రాములు మాత్రమే వచ్చింది. పాతూరులో ఓ వినియోగదారుడు మూడు కేజీల ఉల్లిపాయలు కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లి ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషిన్‌లో చూడగా 2.5 కేజీలు మాత్రమే ఉన్నాయి. ఇలా వీరిద్దరే కాదు ప్రతిచోటా సరుకు తూకాలు, కొలతలు, నాణ్యత తదితర విషయాల్లో వినియోగదారులు బోల్తాపడుతూనే ఉన్నారు. సేవల్లో లోపాలున్నా భరిస్తూనే 'ఇదంతా మామూలే' అనుకుని సర్దుకుపోతున్నారు. ఇలాంటి సమయాల్లో వినియోగదారులకు అండగా అనేక చట్టాలు, కమిషన్లు పనిచేస్తున్నాయి. ఏ మాత్రం ఖర్చు లేకుండానే మధ్యవర్తిత్వం ద్వారానో, కమిషన్ ద్వారానో న్యాయ పోరాటం చేసి నాణ్యమైన వస్తు సేవలను పొందవచ్చు. జిల్లాలో పదుల సంఖ్యలో వినియోగదారుల సంఘాలుండేవి. 2016 తర్వాత వాటిలో చురుగ్గా పనిచేసే 18 సంఘాల వారు ఏకమై 'వినియోగదారుల సంఘాల సమాఖ్య' ఏర్పాటు చేశారు. ప్రజల్లో అవగాహన కల్పించే సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఏటా మార్చి 15న 'అంతర్జాతీయ వినియోదారుల హక్కుల పరిరక్షణ దినం' నిర్వహించుకుంటున్నాం.

**వినియోగదారులు మోసపోతే తగిన ఆధారాలతో వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం-2019 ద్వారా పరిహారం పొందవచ్చు.**

- జిల్లా కమిషన్ ఎదుట కోటి రూపాయల పరిహారం లోపు.
- రూ. కోటి నుంచి రూ.10 కోట్ల మధ్య రాష్ట్ర కమిషన్ ఎదుట.
- రూ.10 కోట్ల పైబడిన కేసులు జాతీయ కమిషన్ ఎదుట దాఖలు చేయవచ్చు.
- వినియోగదారులు ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది.

**ఫిర్యాదు చేయండిలా..**

వినియోగదారులు ఎవరైనా మోసపోయినపుడు తెల్ల కాగితంపై అర్జీ రాసి జిల్లా స్థాయిలో డీసీఐసీ, మండల స్థాయిలో ఎంసీఐసీ ద్వారా ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. కొనుగోలు చేసినట్లు రసీదు కచ్చితంగా ఉండాలి. విక్రయించే ప్రతి వస్తువుపైనా ఎంఆర్‌పీ, తయారీ తేదీ, ఎక్స్‌పైరీ డేట్, వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు చెందిన నంబరు విధిగా ముద్రించి ఉండాలి. అలా లేని పక్షంలో వస్తువుల విక్రయ దుకాణాలపై ప్రభుత్వం జరిమానా విధించాలి. అనుమతి లేకుండా సినిమా టికెట్లు అధిక ధరలకు అమ్మినా, తూకాల్లో తేడాలున్నా, సేవల్లో లోపాలను పసిగట్టినా.. ప్రశ్నించి న్యాయం పొందడానికి చట్టాలపై అవగాహన ఉండాలి.

### కమిషన్ గురించి తెలుసుకోవాలి



మేము 30 ఏళ్లుగా వినియోగదారుల సమస్యలపై పోరాడుతున్నాం. సమాజంలో ఎన్ని రకాలుగా మోసపోతున్నామో అవగాహన కల్పిస్తున్నాం. వినియోగదారులు చైతన్యవంతులుగా మారి.. ప్రశ్నించే తత్వం అలవరచుకోవాలి. వినియోగదారులు పొందాల్సిన వస్తు సేవల్లో నాణ్యత లేకపోయినా చూసీచూడనట్టు వదిలేయడం వల్లే సమాజంలో నానాటికీ మోసాలు మరింత పెరుగుతున్నాయి. కార్మిక న్యాయస్థానాలు, వినియోగదారుల కమిషన్ గురించి అవగాహన ఉండాలి. అప్పుడే వ్యాపారుల్లోనూ, అధికారుల్లోనూ చలనం ఉంటుంది. చట్టం గురించి తెలుసుకున్న వారు ఎన్నో విజయాలను సాధించారు.

– చల్లా కిషోర్, వినియోగదారుల సంఘం రాష్ట్ర సభ్యుడు

### నాణ్యత లేని ఉత్పత్తులపై నష్టపరిహారం కోరవచ్చు



నాణ్యత లేని ఉత్పత్తులపై (ప్రొడక్ట్ లయబిలిటీ) తయారీదారులు, విక్రయదారులు, సేవాదారులు అందరూ బాధ్యత వహించాలి. వినియోగదారుకు నష్టపరిహారం చెల్లించాలి. రెండు సంవత్సరాల కాల పరిమితికి లోబడి కమిషన్ ఎదుట ఫిర్యాదులు దాఖలు చేయవచ్చు. వినియోగదారుల్లో చైతన్యం రావాలి. అప్పుడే వినియోగదారుల రక్షణ చట్టం లక్ష్యం నెరవేరుతుంది.

– ఎం.శ్రీలత, జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు



## కేరింత..

హోలీ పండుగ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సందడిగా జరుపుకున్నారు. పల్లె, పట్టణం, ఊరూ, వాడా తేడాలేకుండా చిన్నా పెద్దా అందరూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. పాటలు పాడుతూ.. కేరింతలు కొడుతూ సంతోషంగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోలీ సంబరాలు అంబరాన్నంటాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అనంతపురంలో సంతోషంగా రంగునీళ్లు చల్లుకుంటున్న మహిళలు



అనంతపురంలో రంగులు చల్లుకుని కేరింతలు కొడుతున్న యువకులు

## నేటి నుంచి ఒంటిపూట బడులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** ఎండలు మొదలవడంతో శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. రోజూ ఉదయం 7.45 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు ముగుస్తుందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలలు విధిగా ఒంటిపూట బడులు అమలు చేయాలని ఆదేశించారు. ఈ నెల 17 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కేంద్రాలుగా ఉన్న స్కూళ్లలో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు.

## మహిళల భద్రతకు ఐదు శక్తి బృందాలు

**అనంతపురం:** జిల్లాలో మహిళల భద్రతకు నూతనంగా ఐదు శక్తి బృందాలను ఏర్పాటు చేశామని ఎస్పీ జగదీష్ తెలిపారు. మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు, మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి 'యాప్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతపురం అర్బన్, అనంతపురం రూరల్, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, తాడిపత్రి సబ్ డివిజన్ల పరిధిలో శక్తి బృందాలకు విధులు కేటాయించామన్నారు. అదనపు ఎస్పీ నోడల్ అధికారిగా ఉన్న టీముల్లో ఎస్ఐ నేతృత్వంలో ఇద్దరు మహిళా సిబ్బంది, నలుగురు కానిస్టేబుళ్లు మొత్తం ఏడుగురు సభ్యులు ఉంటారన్నారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వర్తిస్తాయన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్‌కు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 112/100 కాల్స్‌తో శక్తి బృందాలు సంఘటనా స్థలానికి సకాలంలో చేరుకుంటాయన్నారు.

## ● గరుడ వాహనంపై దేవ దేవుడు



గరుడ వాహనంపై దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

**కదిరి:** అశేష భక్త జన గోవింద నామస్మరణ మధ్య ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి శుక్రవారం గరుడ వాహనంపై తిరువీధుల్లో దర్శనమిచ్చారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మదేవుడు తన ఇష్ట వాహనమైన గరుత్మంతున్ని నారసింహుడికి వాహనంగా పంపుతారని, అందుకే ఈ ఉత్సవాన్ని బ్రహ్మ గరుడ సేవ అంటారని అర్చక పండితులు అంజన్ కుమార్ ఆచార్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో సమస్త వాహనాల్లో సర్వ శ్రేష్ఠమైన గరుడ వాహనంపై స్వామివారిని దర్శించుకుంటే స్వర్గం ప్రాప్తిస్తుందని, బాధల నుంచి విముక్తి కల్గుతుందని భక్తుల నమ్మకం. నారసింహుని బ్రహ్మోత్సవాల సమయంలో ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికేది గరుత్మంతుడే కాబట్టి ఈ వాహన సేవకు ప్రాధాన్యత ఉంది.

**రాజగోపుర దర్శనానికి పోటీ**

ఖాద్రీశుడు తూర్పు రాజగోపురం వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా 'ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి గోవిందా.. గోవింద' అంటూ భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. బ్రహ్మ గరుడ సేవలో తూర్పు రాజగోపురం వద్ద స్వామి వారిని దర్శించుకుంటే మరింత పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే భక్తులు తమ ఇలవేల్పు అయిన నృసింహుడిని అక్కడ దర్శించుకోవడానికి పోటీ పడ్డారు. విద్యుత్ దీపాలంకరణ, కదిరి మల్లెలతో శ్రీవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉత్సవాలకు ఉభయదారులుగా బేరి వర్తకులు బీపీ నారాయణప్ప శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారని ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



మహిళల కోలాటం భలే భలే..



ఆలయంలో పోటెత్తిన భక్తులు

## క్లుప్తంగా

### మద్యం మత్తులో యువకుడి మృతి


అజయ్‌కుమార్(ఫైల్)

కంబదూరు: మండల కేంద్రంలో ఓ యువకుడు మద్యం మత్తులో వరి మడిలోకి జారిపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కంబదూరుకు చెందిన రామాంజినేయులు, మణెమ్మ దంపతుల కుమారుడైన అజయ్‌కుమార్(35) వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. పంటలు సరిగా పండకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. అప్పుల ఒత్తిడి తట్టుకోలేక మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి పూటుగా మద్యం సేవించి వరి పంటకు నీళ్లు కట్టేందుకు వెళ్లాడు. ఈ సమయంలో వరి మడిలో జారిపడ్డాడు. అప్పటికే మద్యం మత్తులో ఉండటంతో బురదలో నుంచి పైకి లేవడానికి చేతకాక ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడి మొదటి భార్య వదిలేయడంతో మూడు నెలల క్రితం రెండో పెళ్లి చేసుకున్నాడు.

### చీనీచెట్లు దగ్ధం


కాలిపోయిన చీనీచెట్లు

ఆత్మకూరు: వడ్డుపల్లిలో రైతు ఓబిరెడ్డికి చెందిన చీనీ చెట్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. బాధితుడి వివరాల మేరకు..రైతు నాలుగేళ్ల క్రితం 4 ఎకరాల్లో 600 చీనీచెట్లు సాగు చేశాడు. ఇందుకోసం దాదాపు రూ.5 లక్షల దాకా ఖర్చు చేశాడు. ఈ ఏడాది కాపు వదలాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగి చీనీచెట్లు, చింతచెట్లు, డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

### బాలుడిపై దాడి


గాయపడిన యహోషువా

గుత్తి రూరల్: గార్లదిన్నె మండలం కల్లూరు ఆర్‌ఎస్‌లో ఓ బాలుడిపై శుక్రవారం ఇంటి పక్కన వారు దాడి చేసి గాయపరిచారు. బాధితుడి బంధువులు తెలిపిన వివరాలు.. కల్లూరు ఆర్‌ఎస్‌కు చెందిన రామాంజనేయులుకు ఇంటి పక్కన వారితో చిన్నపాటి విషయంపై గొడవ జరిగింది. ఈ క్రమంలో మాటామాట పెరిగి రామాంజనేయులుపై ఇంటి పక్కన వారు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. తన తండ్రిని కొడుతున్నారని బాలుడు యహోషువా వెళ్లి అడ్డుపడ్డాడు. దీంతో వారు అతడిపై కూడా విచక్షణా రహితంగా దాడి చేశారు. దాడిలో ఎడమ కాలు విరిగి తీవ్రంగా గాయపడిన బాలుడిని గుత్తిలో ఉన్న బంధువులు వెంటనే కల్లూరు నుంచి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతడిని పరీక్షించిన వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

# రాప్తాడులో రౌడీ రాజ్యం

- చట్టాన్ని టీడీపీ చుట్టంగా మార్చుతున్న పోలీసులు
- ఏకపక్షంగా వెళ్తామంటే చూస్తూ ఊరుకోం
- రైతుల సమస్యలపై రాజీ పడను... జైలుకు వెళ్లేందుకూ సిద్ధం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ‘మేము అధికారంలో ఉన్న ఐదేళ్లలో రాప్తాడు నియోజకవర్గంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయి. ఎక్కడా నిర్బంధాలు చేయలేదు. అనవసరంగా ప్రతిపక్ష పార్టీ వారిని పిలిపించి అక్రమ కేసులు బనాయించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చి పరిటాల సునీత ఎమ్మెల్యే అయిన తర్వాత రౌడీ రాజ్యం నడుస్తోంద’ని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నగర శివారులోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరు మండలం సిద్ధరాంపురంలో కురుబ బాలన్న అనే యువకుడిని టీడీపీ వారు కట్టెలతో దాడి చేస్తే పరామర్శించడానికి వెళ్తానంటే పోలీసులు అనుమతులు ఇవ్వలేదన్నారు. సిద్ధరాంపురం ఏమైనా పాకిస్తాన్‌లో ఉందా.. అందుకు ప్రత్యేక వీసాలు కావాలా.. అని ప్రశ్నించారు. రామగిరి మండలం పోలేపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవానికి వెళ్తుంటే దాదులూరు వద్ద డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు వచ్చి అడ్డుకుని బందోబస్తు ఇవ్వలేమని పర్యటన వాయిదా వేసుకోవాలంటూ చెప్పారన్నారు.

**పోలీసులు ప్రజల కోసమా..సునీత కోసమా?**

పోలీసులు ప్రజల కోసం పని చేస్తున్నారా? లేదంటే పరిటాల సునీత కోసం పని చేస్తున్నారా? అని మాజీ ఎమ్మెల్యే మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా లా అండ్ ఆర్డర్ కోసం పని చేస్తున్నారా? లేదంటే టీడీపీని బలపరిచేందుకు పని చేస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలేపల్లికి వస్తే పెద్దపెద్ద గొడవలు అవుతాయని రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ చెబుతున్నారని, ఆయన టీడీపీ ఏజెంటుగా పని చేస్తున్నారా? అని నిలదీశారు. ఊరిలో లేని సమస్యను సృష్టిస్తూ పోలీసు వ్యవస్థను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. వాస్తవానికి ఆ గ్రామంలో టీడీపీ వాళ్లకు లేని ఉద్దేశాలను ఎస్‌ఐ కల్పిస్తూ ఎస్పీ, డీఎస్పీని తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. తమ పార్టీ నేతలు స్టేషన్‌కు వెళ్తే అగౌరవంగా మాట్లాడటడంతో పాటు కింద కూర్చోమని చెబుతారని ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌పై మండిపడ్డారు.

**సీఐ, ఎస్‌ఐలు పద్ధతులు మార్చుకోవాలి**

అనంతపురం రూరల్ మండలంలోని తమ పార్టీ నేతలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. పుట్టపర్తిలో జరిగిన యువత పోరు కార్యక్రమానికి పెద్ద ఎత్తున వాహనాల్లో వెళ్లడంతో వారికి కళ్లు ఎర్రబడ్డాయన్నారు. జనాలను బాగా పిలుచుకెళ్లిన లీడర్లను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని టీడీపీ చుట్టంగా మార్చొద్దని పోలీసులకు హితవు పలికారు. తాను గుండీలు ఇప్పుతా రా కొట్లాడదామని రాప్తాడు సీఐ పిలుస్తారని, ఆయన సీఐనా రౌడీనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూరులో లాఅండ్ ఆర్డర్ సమస్యంతా ఇటుకలపల్లి సీఐతోనే ఉత్పన్నమవుతోందన్నారు. తోపుదుర్తిలో 30 మంది ఇంట్లోకి దూరి మహిళపై దాడి చేస్తే..బాధితులపైనే కేసు కడతాడన్నారు. వారి ఆగడాలు చూస్తూ ఊరుకున్నారంటే తాము సంయమనం పాటించమని చెప్పడమే కారణమనేది గుర్తు పెట్టుకోవాలన్నారు. ఇప్పటికైనా ఇటుకులపల్లి, రాప్తాడు సీఐలు, రామగిరి ఎస్‌ఐ పద్ధతులు మార్చుకోవాలని హితవుపలికారు.

**చంద్రబాబు, సునీత చరిత్రహీనులుగా నిలిచిపోతారు**

లైనింగ్‌పనులు జరిగితే రాప్తాడు నియోజకవర్గంలో లక్షల ఎకరాలు బీళ్లుగా మారే ప్రమాదం ఉందని, దీనిపై రైతులను చైతన్యం చేయాల్సిన బాధ్యత తనపై ఉందని ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఈ పనులు జరిగితే చంద్రబాబు, పరిటాల సునీత చరిత్ర హీనులుగా నిలిచిపోతారన్నారు. నియోజకవర్గ రైతుల సమస్యలపై రాజీ పడబోనని, జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధమన్నారు. సిద్ధరాంపురం గ్రామానికి చెందిన బాధితుడు కురుబ బాలన్నను పరామర్శించడానికి వెళ్లనీయకపోవడంతో ఇక్కడికే బాధితుడిని పిలిపించి మీడియాకు చూపించారు. అనంతపురం రూరల్ జెడ్పీటీసీ చంద్రకుమార్, ఆత్మకూరు ఎంపీపీ హేమలత, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నేత కురుబ నాగిరెడ్డి, ఆత్మకూరు మండల కన్వీనరు బాలపోతన్న, నాయకులు నీరుగంటి నారాయణరెడ్డి, రామగిరి కన్వీనర్ మీనుగ నాగరాజు పాల్గొన్నారు.


### వైఎస్సార్‌సీపీ నేత వాహనంపై టీడీపీ కార్యకర్తల దాడి


రాళ్ల దాడిలో ధ్వంసమైన బొలేరో వాహనం అద్దం

బ్రహ్మసముద్రం: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వాహనంపై టీడీపీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారు. బాధితులు తెలిపిన వివరాలు..పాలవెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖరరెడ్డి కుటుంబ సభ్యులు నటరాజ్ , ప్రశాంత్ అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త భీం రాజ్‌తో కలిసి కర్ణాటకలోని మొలకాల్మూరు కోర్టుకు హాజరై బొలెరో వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. వేపులపర్తి గ్రామంలో మద్యం దుకాణం వద్దకు రాగానే పూటుగా మద్యం సేవించిన టీడీపీ కార్యకర్తలు వినాయక్, గొల్ల శివ వాహనంపై రాళ్లతో దాడి చేశారు. దాడిలో వాహన అద్దం ధ్వంసమైంది. ఘటనపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

### మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రిజ్వాన్

- మరికొందరికి రాష్ట్ర కమిటీలో చోటు


కాగజ్‌ఘర్ రిజ్వాన్

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాగజ్‌ఘర్ రిజ్వాన్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రిజ్వాన్ గతంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్‌గా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శులుగా షేక్ రహ్మంతుల్లా, దాండియా ఖాజామైనుద్దీన్, ఎస్ తబ్రిజ్ షౌకత్ హామి, వీ అబుజార్ నదీం అహ్మద్, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా షేక్ అఫ్జల్, రాష్ట్ర అధికార ప్రతినిధిగా షేక్ నియాజ్ అహ్మద్, రాష్ట్ర ఐటీ వింగ్ జోనల్ అధ్యక్షుడిగా పీ మంజునాథ్ యాదవ్ నియమితులయ్యారు.

# ఉపాధ్యాయులను విస్మరించిన ప్రభుత్వం

- వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి


వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను విస్మరించిందని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంరెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు వచ్చి ఏడాదైన సందర్భంగా శుక్రవారం నగరంలోని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో సక్సెస్ స్కూల్స్ ద్వారా ఇంగ్లిష్ మీడియంను తీసుకొచ్చి 36 వేలమంది టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చారన్నారు. వివిధ డీఎస్సీల ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు రెండేళ్ల అప్రెంటిస్ పీరియడ్ చేసి సర్వీస్ చేసినందుకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చారన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఉపాధ్యాయ పక్షపాతిగా వ్యవహరించారన్నారు. తెలుగు, హిందీ, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను అప్‌గ్రేడ్ చేశారన్నారు. ఈ కారణంగా దాదాపు 30 వేల మంది టీచర్లు ప్రమోషన్లు పొందారన్నారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో మార్చారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే 27 శాతం ఐఆర్ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడున్న ప్రభుత్వం ఎన్నికల హామీలను తొమ్మిది నెలలు పూర్తవుతున్నా పట్టించుకోలేదన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, క్లెయిమ్స్, ఆర్జిత సెలవుల బకాయిలు ఇంతవరకు చెల్లించలేదన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ వేయలేదన్నారు. వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌టీఏ గుర్తింపుకు కృషి చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కల్పలత రెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షుడు అశోక్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధీర్‌కు జిల్లా శాఖ కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, రాష్ట్ర నాయకులు గోవిందరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, వెంకటరమణ, గోపాల్, రామకృష్ణ, జిల్లా నాయకులు ఓబిరెడ్డి, కేశవరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కుందుర్పి: అప్పిలేపల్లి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ నగేష్ తెలిపిన వివరాలు.. కళ్యాణదుర్గం మండలం దురదకుంట గ్రామానికి చెందిన గొల్ల వీరేష్ కుందుర్పిలో పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. అప్పిలేపల్లి వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వీరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పూర్తి వివరాలు శనివారం వెల్లడిస్తామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

# ఆర్డీటీ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- ఉన్నతాధికారుల వేధింపులే కారణమని సూసైడ్ నోట్


ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ మల్లికార్జున


మల్లికార్జున రాసిన సూసైడ్‌నోట్

ఉరవకొండ: స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఉద్యోగి విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు..పట్టణానికి చెందిన ఎరుకల మల్లికార్జున స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో అకౌంటెంట్‌గా పని చేసేవాడు. శుక్రవారం ఉరవకొండ శివారులో విషద్రావకం తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు. బాధితుడి నుంచి పోలీసులు సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు.

**సూసైడ్ నోట్ ఇలా..**

‘ఆరేళ్లుగా ఉరవకొండ, గుంతకల్లు ఆర్డీటీ కార్యాలయాల్లో అకౌంటెంట్‌గా పని చేశా. కొంత కాలం క్రితం ఏటీఎల్ గ్రామస్వరాజ్యనిధి చెక్కును ఇచ్చి విత్‌డ్రా చేసుకురావాలని ఆదేశించారు. వారు చెప్పిన విధంగా డ్రా చేసి మొత్తం నగదు వారికి అందించా. ఉరవకొండ, గుంతకల్లు నుంచి బదిలీ అయ్యే సమయంలో రికార్డులన్నీ పరిశీలించి, నా నుంచి ఎలాంటి డ్యూస్ లేవని క్లియరెన్స్ చేసి సీనియర్ అకౌంటెంట్ నాకు రిలీవింగ్ సర్టిఫికెట్ ఇచ్చారు. అయితే గ్రామ స్వరాజ్య నిధులు తానే స్వాహా చేసినట్లు అధికారులు ఆరోపించి తన మీద పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి ఆర్డీటీ ఆఫీసుకు పిలిచి డబ్బు కట్టాలని బెదిరించాడు. డబ్బు మొత్తం ఆర్డీటీ అధికారులకు ఇచ్చా. ఇందులో నా ప్రమేయం లేదు. ఆర్డీటీ అధికారుల వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నా’ అంటూ లేఖలో పొందుపరిచాడు.

# వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై హత్యాయత్నం

- నిందితులు టీడీపీ కార్యకర్తలు


బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి తదితరులు

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం జంగాలపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాకర్తలపై టీడీపీ కార్యకర్తలు హత్యాయత్నం చేశారు. గురువారం రాత్రి బాలంపల్లి వైపు నుంచి వస్తున్న అశ్వర్థ, దేవేగౌడలపై మార్గ మధ్యంలో కాపుకాచిన టీడీపీ కార్యకర్తలు సాయికుమార్, శ్రీనివాసులు, గోవిందప్ప మారణాయుధాలతో విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు వెంటనే హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి శుక్రవారం హిందూపురం జిల్లా సర్వజనాస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక ఫోన్ ద్వారా బాధితులను పరామర్శించారు. అనంతరం వేణురెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ టీడీపీ నేతల అరాచాకాలను ప్రోత్సహిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. పోలీసులు నిందితులను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా వ్యక్తిగత కక్షలే దాడులకు కారణమని, ఇరుపక్షాలపై కేసు నమోదు చేయనున్నట్లు సీఐ ఆంజనేయులు ప్రకటించారు.

### పావురం గుడ్ల కోసం వెళ్లి..

- బావిలో పడి చిన్నారి మృతి


పునీత్ కుమార్

రాప్తాడు: పావురం గుడ్ల కోసం వెళ్లిన చిన్నారి బావిలో పడి మృతి చెందిన ఘటన భోగినేపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన పామాల లక్ష్మి ఏకైక కుమారుడు పామాల పునీత్‌కుమార్ (8) శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం తగరకుంట గ్రామంలో ప్రైవేటు పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. హోలీ సందర్భంగా శుక్రవారం పాఠశాలకు సెలవు కావడంతో స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని పాడు బడిన బావి వద్దకు వెళ్లారు. బావిలోని రంధ్రాల్లో ఉన్న పావురాల గుడ్ల వెతుకుతుండగా పునీత్‌కుమార్ కాలుజారి బావిలో పడిపోయాడు. చిన్నారి స్నేహితులు వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించగా వెంటనే వారు అక్కడికి చేరుకుని వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది దాదాపు 3 గంటల పాటు శ్రమించి చిన్నారి మృతదేహాన్ని బయటకు తీశారు. చిన్నారి మృతదేహంపై పడి చిన్నారి తల్లి రోదించిన తీరు పలువురి కంట నీరు తెప్పించింది. ఇదిలా ఉండగా మూడేళ్ల క్రితం చిన్నారి తండ్రి నారాయణస్వామి రైలు ప్రమాదంలో మృతి చెందాడు.


### అనంతలో పరిశ్రమల స్థాపనకు కృషి

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

తాడిపత్రి టౌన్: అనంతపురం జిల్లా పరిశ్రమల స్థాపనకు అనుకూలమని, ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం ఆయన తాడిపత్రిలో పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి స్వగృహానికి వెళ్లిన ఆయన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితో కాసేపు ముచ్చటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో విస్తారంగా గనులు ఉన్న కారణంగా లభ్యమయ్యే ముడిసరుకు ఆధారిత పరిశ్రమలు జిల్లాకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆజాద్‌గ్రూప్, సోలార్ సంబంధిత ప్రాజెక్టులు క్లియర్ అయ్యాయన్నారు. ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

### దానిమ్మ తోట దగ్ధం


కాలిపోయిన దానిమ్మచెట్లు, డ్రిప్ పైప్‌లు

రాయదుర్గంటౌన్: జుంజురాంపల్లిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో దానిమ్మ చెట్లు, డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. బాధిత రైతు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు మఠం తిప్పేస్వామి నాలుగెకరాల్లో దానిమ్మ సాగు చేశాడు. విద్యుత్ ప్రధాన తీగలు షార్ట్‌సర్క్యూట్ జరిగి నిప్పులు కిందున్న ఎండుగడ్డిపై పడటంతో మంటలు చెలరేగి పొలమంతా వ్యాపించాయి. దీంతో దానిమ్మ చెట్లు, డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. ఘటనలో రూ.8 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

### టీకాలతో గాలికుంటు నివారణ


పశువులను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక అధికారి రమేష్‌రెడ్డి

శింగనమల: పశువులకు గాలి కుంటు వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గుమ్మేపల్లిలో శుక్రవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి కుంటు వ్యాధి ఒక పశువు నుంచి మరో పశువుకు త్వరగా వ్యాపిస్తుందన్నారు. పాడి పశువులు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. గాలికుంటు నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారి మల్లిక, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా శివలక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవం


అలంకరణలో శివలక్ష్మీ చెన్నకేశవస్వామి

పెద్దవడుగూరు(యాడికి): యాడికిలోని శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శివలక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణం జరిపించారు. వివిధ పార్టీల నాయకులు, వేలాది మంది భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శివలక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంరించిన రథంపై ఉంచి పూజలు నిర్వహించారు. వేలాది భక్తుల చెన్నకేశవస్వామి నామస్మరణతో రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆర్యవైశ్య వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో వైఎస్సార్‌సీపీ నాయకులు మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు స్వామి లడ్డూ, చిత్రపటాలను పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున తినుబండారాలు, ఆటబొమ్మలు, వివిధ రకాల దుకాణాలు వెలియడంతో యాడికిలో సందడి నెలకొంది. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఆలయ ఈఓ దుర్గప్రసాద్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


వేలాది మంది భక్తుల నడుమ సాగుతున్న రథోత్సవం

## క్లుప్తంగా

### పార్వతీదేవికి వెండి ముఖ కవచం


వెండి ముఖ కవచాన్ని అందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీదేవికి శుక్రవారం అనంతపురానికి చెందిన కవి, కడియాల రవీంద్ర దంపతులు రూ.76 విలువ గల వెండి ముఖ కవచాన్ని ఆలయ ఈఓ బాబుకు అందించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణశాస్త్రి పాల్గొన్నారు.

### పంపనూరు కొండపై వైద్య శిబిరం


భక్తులకు మందులను అందిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు కొండపై వెలసిన మలహోబిల లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కొండపై వైద్య సిబ్బంది వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వృద్ధులు, అనారోగ్యంగా ఉన్న వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా మందులు అందజేశారు. ఎండలకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

### రోడ్డు నిర్మించండి


సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలోని 49వ డివిజన్ ఇందిరానగర్‌లో ప్రధాన రహదారి నిర్మించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వాహనదారులు, ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ 26 ఏళ్ల కిందట వేసిన ప్రధాన రహదారి ఇప్పుడు పాడైపోయిందన్నారు. గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం కోసం సంతకాలు సేకరించి ఈ నెల 16న కమిషనర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, ప్రసాద్, చెన్నకేశవులు, హరికృష్ణ, కుమార్, షరీఫ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు


రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కనగానపల్లి: మండల పరిధిలోని పాతపాళ్యం గ్రామంలో శుక్రవారం రాతిదూలం లాగుడు పోటీలను ఉత్సాహంగా జరిగాయి. గ్రామంలో నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా స్థానిక గ్రామస్తుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీల్లో 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి. పులేటిపల్లి భాస్కరరెడ్డి, నంద్యాల హరినాథరెడ్డి ఎద్దులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

### సర్వజనాస్పత్రిలో సేవలు మెరుగుపరచండి

అనంతపురం టవర్‌క్లాక్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో తగినంత సిబ్బందిని నియమించి సేవలను మెరుగుపరచాలని ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతలు నాగరాజు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదని పేర్కొన్నారు. దీంతో వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయని తెలిపారు.

### పైప్ లీకేజీతో నీరు వృథా


పైపు పగలడంతో వృథాగా పోతున్న నీరు

ఆత్మకూరు: ఆత్మకూరు బైపాస్‌లో పైపు లీకేజుతో నీరు వృథా అవుతోంది. వేసవి కాలం ప్రారంభమవడంతో నీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ఓ వైపు చర్యలు తీసుకుంటున్నారు. అయితే అక్కడక్కడా పైపు లీకేజులతో నీరు వృథాగా పోతున్నాయి. బైపాస్ సమీపంలో రోడ్డు పక్కన పైపు పగిలిపోవడంతో పెద్ద ఎత్తున నీరు వృథా అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌కు మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.


వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం వద్ద మహిళా నేతల హోలీ సంబరాలు


అనంతపురంలో రంగులు చల్లుకుంటున్న యువకులు

# హోలీ.. ఆనందాల కేళి

అనంతపురం కల్చరల్: హోలీ పండుగతో శుక్రవారం నగరమంతటా రంగుల హరివిల్లు వెల్లివిరిసింది. ఆనందాల కేళిలో నగరవాసులు మునిగి తేలారు. పాతూరు, పరిసర ప్రాంతాల్లో దశాబ్దాల కిందటే స్థిరపడిన మరాఠీలు, జైనులు, రాజస్థానీ సేట్లు రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు. జైనమందిరాల్లో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. బ్రహ్మకుమారీలు హోలీ శుభసందేశాన్ని తెలిపి స్వీట్లు పంచారు. తమ జీవితాలు రంగుల హరివిల్లుగా ఆనందాలతో నిండాలన్న ఉద్దేశంతో రంగుల పండుగ జరుపుకుంటారని జైనమత పెద్దలు పేర్కొన్నారు. విద్యార్థులు సైతం వాహనాలపై తిరుగుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు.

అలాగే ఫాల్గుణ పౌర్ణమి కావడంతో పలు చోట్ల సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం, హెచ్చెల్సీ కాలనీ మంజునాథస్వామి ఆలయంలో, బాబా మందిరాలలో సత్యదేవుని వ్రతాలు నిర్వహించారు.


శివాలయంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్న అర్చకులు

**సంబరంగా హోలీ వేడుకలు**

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం హోలీ వేడుకలు అంబరమంటాయి. మహిళా విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళా నాయకురాళ్లు, తదితరులు హాజరయ్యారు. ముఖ్య అతిథి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ అందరి జీవితాల్లో హోలీ పండుగ వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.కృష్ణవేణి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేయాలని కోరారు. లేకుంటే మహిళల ఆగ్రహానికి గురికాకతప్పదన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు యాడికి లక్ష్మీదేవి, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు సంధ్య, రాజీవ్ కాలనీ సర్పంచ్ ఆశాబీ, బీకేఎస్ సర్పంచ్ పార్వతి, నాయకురాళ్లు ఉష, హరిత, ప్రసన్న, చంద్రకళ, భానుమతి, ప్రియాంక, నీలావతి, నాగలక్ష్మి, సాకే చంద్రలేఖ, కార్పొరేటర్లు లావణ్య, రాజేశ్వరి, లక్ష్మీదేవి, దుర్గ, లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ముఖ్యంగా గంగినేపల్లి, ఎర్రోనిపల్లి, మేకేనాయక్ తదితర ప్రాంతాల్లో చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు.

రాప్తాడు: నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో శుక్రవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. మండలంలో 16 గ్రామా పంచాయతీల్లోని గ్రామాల్లోనూ హోలీ వేడుకలు జరిగాయి. గ్రామాల్లో చిన్నారులు, మహిళలు, పురుషులు ప్రతి ఒక్కరూ రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాప్తాడులో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వెఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సాకే వెంకటేష్, మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నరు.




అనంతపురంలో హోలీ వేడుకలు


చెన్నేకొత్తపల్లిలో రంగులు చల్లుకుంటున్న బాలబాలికలు

### ఘనంగా మలహోబిలేశుడి రథోత్సవం


అలంకరణలో లక్ష్మీనరసింహాస్వామి

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు కొండపై వెలసిన మలహోబిల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని నిర్వహించారు. పల్లకీలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో రథం వద్దకు తీసుకువచ్చి రథంలో ఉంచి పూజలు చేశారు. అనంతరం మడక తేరులో భాగంగా ఉదయాన్నే కొంత దూరం లాగారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో భక్తులందరూ కలసి రథాన్ని లాగారు. భక్తులు స్వామి వారి విగ్రహం వద్ద , రథానికి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం పరుష కార్యక్రమంలో భాగంగా భక్తులు పన్నేరపు బండ్ల ప్రదర్శన, స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు.

### ఇన్‌చార్జ్ ఈఓ బాధ్యతల స్వీకరణ


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఈఓ శోభారాణి

అనంతపురం కల్చరల్: మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం ఇన్‌చార్జ్ ఈఓగా శోభారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈఓగా పనిచేసిన సాకే రమేష్‌బాబు ఆమెకు బాధ్యతలు అప్పగించారు. శోభారాణి గుగూడు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఉంటూనే కాశీవిశ్వేశ్వరాలయం ఇన్‌చార్జ్ ఈఓగా వ్యవహరిస్తారు. సాకే రమేష్‌బాబు పెన్నహోబిలం రెగ్యులర్ ఈఓగా ఉంటారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన శోభారాణి వేదపండితులు, భక్త మండలి నిర్వాహకులు నరేంద్ర చౌదరి, ఎర్రిస్వామి, రాజు తదితరులతో కలిసి కాశీవిశ్వేశ్వరుడికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం భక్తమండలితో కలిసి కృషి చేస్తామని తెలిపారు.

## విశాఖ స్టీల్‌కు మోసపూరిత ప్యాకేజీపై నిరసన

అనంతపురం అర్బన్: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ మోసపూరితంగా ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు విమర్శించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఓబులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులను అప్పులు తీర్చడానికి మాత్రమే వినియోగించాలని, కార్మికుల వేతనాలకు, ముడిసరుకు, ప్లాంట్ నిర్వహణకు అవసరమైన పరికాల కొనుగోలుకు ఉపయోగించరాదని పేర్కొన్నారన్నారు. దీన్ని బట్టి చూస్తే ఇదో మోసపూరిత ప్యాకేజీ అనేది స్పష్టమవుతోందన్నారు. అప్పులు తీర్చి ప్రైవేటు వారికి ప్లాంట్‌ను ధారాదత్తం చేయాలనే కుట్ర కనిపిస్తోందన్నారు. విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో విలీనం చేయడం సాధ్యం కాదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి శ్రీనివాసవర్మ ప్రకటించడం అన్యాయమన్నారు. ప్లాంట్ నడిపేందుకు అవసరమైన నిధులను కేంద్రం నుంచి తీసుకురావాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, ముర్తుజా, ఎర్రిస్వామి, లక్ష్మీనరసమ్మ, తిరుమలేష్, పెద్దక్క, రాఘవేంద్ర, లక్ష్మీనారాయణ, పెన్నోబులేసు, నల్లప్ప, ఆదినారాయణ, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

## నేత్రపర్వం.. మహాలక్ష్మి ఆవిర్భావ దినోత్సవం


అమ్మవారికి పుష్పాభిషేకం చేస్తున్న దృశ్యం


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆర్‌ఎఫ్ రోడ్డు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీమహాలక్ష్మి ఆవిర్భావ దినోత్సవం నేత్రపర్వంగా సాగింది. అర్చక పురోహితులు 16 రకాల పుష్పాలతో, విశిష్ట సౌభాగ్య పరిమళ ద్రవ్యాలతో మహాపుష్పాభిషేకం కనుల పండువగా సాగింది. సర్వాంగ సుందరంగా అలంకార సేవలో దర్శనమిచ్చిన అమ్మవారి ముందు వందలాది మంది మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. అనంతరం ఐదు రకాల నైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. భక్తిగీతాలు, అమ్మవారి లలిత సహస్రనామాలతో పాటూ శ్రీమాత్రేనమః అంటూ భక్తులు పెద్ద ఎత్తున ఆలయ పరిసరాలను మార్మోగించారు. ఈ సందర్భంగా పుష్పాభిషేకం నిర్వహించిన అర్చకులు ఆలూరు హరికృష్ణశర్మ పౌర్ణమి విశిష్టత, కలియుగాన అమ్మవారి ఆవిర్భావ దినోత్సవ ప్రత్యేకతను వివరించారు. అనంతరం మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తమండలి నిర్వాహకులు పాల్గొన్నారు.

### ఇఫ్తార్ విందులో మేయర్ వసీం



అనంతపురం కల్చరల్: నగరంలోని రెండో రోడ్డు బాహువుద్దీన్ మసీదులో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు నగరపాలక సంస్థ మేయర్ వసీం ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. మసీదులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వజూఖానా ప్రారంభంలో ఆయన మాట్లాడుతూ మసీదు ప్రాంగణంలో అత్యాధునికమైన వసతులతో వజూఖానాను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో మరింత అభివృద్ధి కార్యక్రమాలు సాగుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అనంతరం మసీదు పెద్దలు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, ముతవల్లి ఫరీదుద్దీన్, సెక్రటరీ పర్వేష్, షబ్బీర్ హుస్సేన్, రజా షమీ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


కాలు విరగడంతో చికిత్స పొందుతున్న సంగప్ప



ప్రమాదంలో గాయపడిన లక్ష్మి, చిన్నారులు

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి కొండపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు .. అనంతపురం సిండికేట్‌నగర్‌కు చెందిన సంగప్ప, లక్ష్మి తన ఇద్దరి పిల్లలతో కలసి పంపనూరు కొండపై జరుగుతున్న మలహోబిలేశ్వరుడి ఉత్సవాల్లో అన్నదానం చేయడానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. వడ్డుపల్లి కొండపైకు రాగానే వెనుక నుంచి వస్తున్న బస్సు ఓవర్‌టేక్ చేసింది. రోడ్డు పక్కకు దిగిన ద్విచక్ర వాహనాన్ని రోడ్డుపైకి ఎక్కించబోయి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో సంగప్పకు కాలు విరిగిపోయింది. లక్ష్మీతో పాటు ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. సంగప్ప తమ్ముడు రాజశేఖర్, కుటుంబ సభ్యులు క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాచానపల్లి సర్పంచ్ బండ అంజియాదవ్ బాధితులను పరామర్శించారు.

## పన్ను చెల్లించలేదని కొళాయి కనెక్షన్లు కట్

అనంతపురం కార్పొరేషన్: పన్నుల వసూళ్ల గడువు దగ్గరపడటంతో నగరపాలక సంస్థ అధికారులు దూకుడు పెంచారు. పన్ను కడతావా.. పన్ను చెల్లించని వారి ఇళ్ల వద్దకు వెళ్లి కొళాయి కనెక్షన్ కట్ చేస్తున్నారు. శుక్రవారం డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది, నీటి సరఫరా విభాగం సిబ్బంది మంగళవారి కాలనీ, శ్రీనగర్ కాలనీ, రాణినగర్, భవానీనగర్, తదితర ప్రాంతాల్లో నాలుగు కొళాయి కనెక్షన్లు తొలగించారు. ఈ సందర్భంగా ఇళ్ల యజమానులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఇంతకాలం ఆఫీసులకు పరిమితమై.. ఇప్పుడు వచ్చి పన్నులు కట్టలేదని నీటి సరఫరా తొలగించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో ఆర్‌ఓలు లక్ష్మీదేవి, విజయ్ కుమార్, ఆర్‌ఐలు రజాక్, చంద్రశేఖర్, పెద్దక్క, రఘునాథ్ రెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను ప్రజలు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


కొళాయి కనెక్షన్ తొలగించేందుకు సిద్ధమైన సిబ్బంది

### ఆత్మహత్యాయత్నం చేసిన మెడికో మృతి

కర్నూలు(హాస్పిటల్): ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైద్య విద్యార్థిని రమ్యతేజ శుక్రవారం మృతి చెందింది. అనంతపురం మెడికల్ కాలేజీలో అనస్థీషియా ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ నవీన్‌కుమార్ కుమార్తె రమ్యతేజ కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. గత నెలలో స్నేహితులతో కలిసి అహోబిలం వెళ్లి తిరిగి వచ్చింది. అనంతరం వ్యక్తిగత కారణాలతో హాస్టల్ గదిలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. అప్పటి నుంచి కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది కొంతమేర కోలుకుంది. ఈ క్రమంలోనే గత నెల 28 నుంచి 3వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు కూడా రాసింది. ఆ తర్వాత అనంతపురం వెళ్లి అక్కడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం ఆస్పత్రిలో చేరింది.రారు. అయితే మళ్లీ పరిస్థితి విషమించి కోలుకోలేక శుక్రవారం ఉదయం చనిపోయింది. ఆమె మరణం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, వైద్యులు సంతాపం వ్యక్తం చేశారు.

### ఒంటి పూట బడులు ప్రారంభం

రాప్తాడు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 15 నుంచి ఒంటి పూట బడులు ప్రారంభం కానున్నాయని ఎంఈఓ మల్లికార్జున ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 23 వరకూ పాఠశాలలు కొనసాగుతాయన్నారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం 1.15 నుంచి 5 గంటల వరకూ తరగతులు ఉంటాయన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.

### మహిళను బెదిరించి చోరీ

తాడిపత్రి: మండలంలోని సజ్జలదిన్నె పారిశ్రామికవాడలో బండల పాలిష్ ఫ్యాక్టరీలో నివాసం ఉంటున్న వెంకటేశ్వరమ్మ ఇంట్లోకి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి చొరబడి, ఆమెను బెదిరించి రూ.10వేల నగదును అపహరించాడు. ఈ మేకు ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే రెండు రోజుల క్రితం యర్రగుంటపల్లి వద్ద మేకలు మేపుకుంటుండగా అటుగా ద్విచక్రవాహనంలో వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఒక్క మేకను ఎత్తుకుని పారిపోయినట్లు బాధితుడు మనోహర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# ‘పది’ పరీక్షల నిర్వహణలో గందరగోళం

- శుక్రవారం రాత్రి 10 గంటలైనా ఇన్విజిలేటర్లకు అందని నియామక ఉత్తర్వులు
- శనివారం ఉదయం 10 గంటలకు రిపోర్ట్ చేసుకోవాలంటూ ఉత్తర్వులు
- సమాచార లోపంతో ఆందోళనలో ఇన్విజిలేటర్లు
- విద్యాశాఖ అధికారుల డొల్లతనం బట్టబయలు



అనంతపురం ఎడ్యుకేషన్: అత్యంత కీలకమైన పదో తరగతి పరీక్షల నిర్వహణ జిల్లాలో గందరగోళంగా మారింది. ఈ నెల 17 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారుల (డీఓ) నియామకాలు పూర్తయి వారికి శిక్షణ కూడా ఇచ్చారు. అయితే ఇన్విజిలేటర్లగా నియమించిన వారికి ఉత్తర్వులు అందజేయడంలో విద్యాశాఖ అధికారుల డొల్లతనం బట్టబయలైంది. ఇన్విజిలేటర్లుగా నియమించిన వారికి శనివారం ఉదయం ఆయా కేంద్రాల్లో రిపోర్ట్ చేసుకుని, ఆ వెంటనే సీఎస్‌లు, డీఓలు సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి రెండు రోజుల కిందటే (గురువారం) ఇన్విజిలేటర్ల జాబితాలను ఆయా కేంద్రాల సీఎస్‌లకు అందజేశారు. వారి నుంచి ఇన్విజిలేటర్లగా నియామకమైన వారికి సమాచారం చేరాల్సి ఉంది. అధికారులేమో సీఎస్‌లకు జాబితాలు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. వారిలో చాలామంది సీఎస్‌లు జాబితాల్లో ఉన్నవారికి సమాచారం ఇవ్వకుండా మీనమేషాలు లెక్కిస్తూ గడిపారు. ఫలితంగా శుక్రవారం రాత్రి 10 గంటలైనా చాలామంది ఇన్విజిలేటర్లకు సమాచారం చేరలేదు. ఉదయం నుంచి చాలామంది టీచర్లు తమను ఇన్విజిలేటర్ల విధులకు నియమించారా? ఏ కేంద్రానికి వేశారు? అని డీఈఓ కార్యాలయ సిబ్బందిని, ఉపాధ్యాయ సంఘాల నాయకులను, ఎంఈఓలను అడుగుతూ కనిపించారు. జిల్లాలో మొత్తం 135 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,718 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. అనంతపురం డివిజన్‌లో 864 మంది, గుత్తి డివిజన్‌లో 854 మందిని నియమించారు. వీరిలో శుక్రవారం రాత్రివరకు 40 శాతానికి పైగా సమాచారం అందలేదు.

**ఎవరిదీ నిర్లక్ష్యం**

ప్రతిసారీ ఇన్విజిలేటర్ల నియామకాలు పూర్తయిన తర్వాత ఆయా మండలాల విద్యాశాఖ అధికారులకు జాబితాలు పంపేవారు. వారు ఆయా మండలాల పరిధిలోని పాఠశాలల టీచర్లకు చేరవేసేవారు. ఆ మేరకు హెచ్‌ఎం/ఎంఈఓల వద్ద రిలీవ్ అయి ఆయా కేంద్రాల్లో రిపోర్ట్ చేసుకునేవారు. ఈ ప్రక్రియ మొత్తం రెండు రోజుల ముందే జరిగిపోయేది. అయితే ఈసారి ఎంఈఓలకు కాకుండా పరీక్ష కేంద్రాల సీఎస్‌లకు జాబితాలు పంపడం సమస్యగా మారిందని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. తీరా పరీక్షల సమీపిస్తున్న వేళ ఇలాంటి గందరగోళ పరిస్థితులు ఎదురుకావడం పట్ల ఎవరిదీ నిర్లక్ష్యం అంటూ విద్యాశాఖలో చర్చ జరుగుతోంది. కాగా శుక్రవారం రాత్రి ఎంఈఓలతో జరిగిన టెలీకాన్ఫరెన్స్‌లో పలువురు ఎంఈఓలు ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో మరెన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయోననే ఆందోళన ఉపాధ్యాయుల నుంచి వ్యక్తమవుతోంది.

### చీనీ తోటకు నిప్పు

శింగనమల: శింగనమల ఎస్సీ కాలనీకి చెందిన పర్లగొల్ల ముత్యాలప్ప చీని తోటకు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం నిప్పు పెట్టడడంతో కాపుకు వచ్చిన 80 చెట్లు కాలిపోయాయి. రూ.3 లక్షల వరకూ నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.